గిరిపుత్రుడు

పర్వతారోహణలో రాణిస్తున్న యశ్వంత్ • ఐదు పర్వతాలు అధిరోహించిన మానుకోట యువకుడు

ఎవరెస్ట్ పర్వతం ఎక్కేందుకు సన్నాహాలు • ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండా అతని స్వగ్రామం. పేద గిరిజన కుటుంబంలో జన్మించిన ఆ యువకుడు తన కలల సాకారానికై అడుగులు వేస్తున్నాడు. ఆకాశమే హద్దుగా అచంచలమైన ఆత్మవిశ్వాసంతో పర్వతాలను అవలీలగా అధిరోహిస్తున్నాడు. సాధించాలన్న కసికి పట్టుదల తోడైతే కొండలైనా పిండిచేయగలనన్న ధీమాతో ముందుకెళుతున్న ఆ గిరి పుత్రుడే భూక్యా యశ్వంత్. అడ్డంకులు ఎదురైనా అధిగమిస్తూ ఇప్పటికే ఐదు పర్వతాలు ఎక్కిన యశ్వంత్..మౌంట్ ఎవరెస్ట్‌ను ముద్దాడాలని చూస్తున్నాడు. ఆశయం పెద్దదైనా..ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా అండగా నిలిస్తే అద్భుతాలు సృష్టిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో యశ్వంత్‌తో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ.

పర్వతారోహణపై ఆసక్తి ఎలా?

❖ ఊహ తెలిసిన వయసు నుంచే పర్వతారోహణపై ఆసక్తి ఏర్పడింది. బాల్యం అంతా భూక్యా తండాలో గడిచిపోయింది. భారత సైనిక దళంలో ఎలాగైనా పనిచేయాలన్న ఆకాంక్ష చిన్నప్పటి నుంచే ఉండేది. నా ఆసక్తిని గమనించిన టీచర్లు..మౌంటేనీరింగ్ బాగుంటుందని సలహా ఇచ్చారు. అప్పటి నుంచి అటువైపు అడుగులు వేశాను. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో పర్వతారోహణలో అడుగుపెట్టాను. ఇక మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. 15 ఏండ్ల వయసులో భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో చేరాను. ఆ తర్వాత ఇండియన్ హిమాలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ అండ్ ఎకోటూరిజంలో సుక్షితులైన నిపుణుల దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఇది బాగా కలిసి వచ్చింది.

తొలి అడుగు ఎక్కడా?

❖ నా పర్వతారోహణ ప్రయణంలో తొలి అడుగు దక్షిణాఫ్రికాలో అతిపెద్ద పర్వతంగా పేరొందిన మౌంట్ కిలిమంజారోపై వేశాను. 5895మీటర్ల ఎత్తైన కిలిమంజారోపై ప్రతికూల పరిస్థితుల మధ్య విజయవంతంగా అధిరోహించాను. ఆ తర్వాత రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రస్ (5642మీటర్లు) ఎక్కాను. గడ్డ కట్టే చలిలో సాగిన ఈ ప్రయాణం తలుచుకుంటేనే ఒళ్లు జల్దరిస్తుంది. భాష పరంగా సమస్యలు ఎదుర్కొన్నా.. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాను. ఈ రెండింటి తర్వాత మౌంట్ కొసిజ్స్కో(2228మీ, ఆస్ట్రేలియా), మౌంట్ యునమ్ (6100మీ, హిమాచల్ ప్రదేశ్), మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ (5364మీ) అధిరోహించాను. లేహలోని 6వేల మీటర్ల పర్వతాన్ని ఎక్కాను.

భవిష్యత్ లక్ష్యాలేంటీ?

❖ ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఏడు అతిపెద్ద పర్వతాలను అధిరోహించాలని భవిష్యత్ లక్ష్యంగా పెట్టుకున్నాను. ఇప్పటికి మూడు పూర్తిచేశాను, ఇంకా నాలుగు పర్వతాలు ఎక్కేందుకు సన్నాహలు చేస్తున్నాను. మౌంటేనీరింగ్ అనేది ఖర్చుతో కూడుకున్న అంశం. దీనికి తోడు ఒక్కో దేశంలో అక్కడి పరిస్థితులకు అనుగుణంగా పర్వతారోహణకు అవకాశం కల్పిస్తారు. అందుకు తగ్గట్లు సిద్ధంగా ఉండాల్సి వస్తుంది. తదుపరి మౌంట్ ఎవరెస్ట్‌పై దృష్టి పెట్టాను. మార్చి ఆఖరి వారం గానీ.. ఏప్రిల్ తొలి వారంలో గానీ ఎవరెస్ట్‌పైకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను.

ఎవరెస్ట్ పర్వతారోహణ ఎలా?

❖ ప్రపంచంలోనే అతిపెద్ద పర్వతంగా పేరొందిన ఎవరెస్ట్‌పైకి వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాను. ఇది ఖర్చుతో కూడుకున్న అంశం. మొత్తం 40 లక్షలు అవసరమవుతాయి. ఇందుకోసం రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు, కొంత మంది వ్యక్తుల నుంచి ఆర్థిక సాయం అడుగుతున్నాను. ఎవరెస్ట్ పైకి వెళ్లేందుకు కావాల్సిన సామగ్రి, దుస్తులు, ప్రత్యేకమైన బూట్లు, అనుమతి కోసం దరఖాస్తు, షెర్పాకు చెల్లించే మొత్తం. ఇలా ఖర్చు తడిసి మోపెడు అవుతుంది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం లభిస్తే.. రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తానన్న నమ్మకం నాకుంది.

కుటుంబ నేపథ్యం ఏంటీ?

❖ మాది సామాన్య కుటుంబం. నాన్న రామ్మూర్తి విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి. అమ్మ గృహిణి, సోదరుడు ఉన్నత చదువులు చదువుతున్నాడు. భవిష్యత్‌లో ప్రపంచంలోని అన్ని పర్వతాలు అధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా నిలువాలన్న ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతున్నాను. ఎలాగైనా భారత ఆర్మీలో పనిచేసేందుకు అడుగులు వేస్తున్నాను.

శరవణన్‌కు పారిస్ బెర్తు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు భారత యువ సెయిలర్ విష్ణు శరవణన్ బెర్తు దక్కించుకున్నాడు. బుధవారం జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ ఐఎల్‌సీఏ-7 అర్హత టోర్నీలో విష్ణు 26వ స్థానంలో నిలిచాడు. దీంతో ఆసియా దేశాల తరఫున అత్యుత్తమ ర్యాంక్ దక్కించుకోవడంతో పారిస్ విశ్వక్రీడలకు బెర్తు ఖరారు చేసుకున్నాడు. ఈ టోర్నీలో మొత్తం 152 మంది పోటీపడగా, విష్ణు 174 పాయింట్లతో పోటీని ముగించాడు. తద్వారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత సెయిలర్‌గా విష్ణు నిలిచాడు.

అఖిల్‌కు కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

కైరో: ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్ అఖిల్ షెరాన్ కాంస్య పతకంతో మెరిశాడు. బుధవారం జరిగిన పురుషుల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో అఖిల్ 451.8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. అర్హత రౌండ్‌లో 589 పాయింట్లతో మెయిన్ డ్రాలోకి ప్రవేశించిన అఖిల్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ తుది పోరులో జిరి ప్రివత్‌స్కీ (462.9), రోమెన్ ఔపురి (460.5) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు ఖాతాలో వేసుకున్నారు. బుధవారంతో ముగిసిన టోర్నీలో భారత షూటర్లు రెండు స్వర్ణాలు సహా మూడు రజతాలు, ఒక కాంస్య పతకంతో అగ్రస్థానంలో నిలిచారు.

వ్రితి పసిడి ధమాకా

• ఖేలో ఇండియా యూత్‌గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చెన్నై వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా యూత్‌గేమ్స్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పసిడి ధమాకా కొనసాగిస్తున్నది. ఇప్పటికే మూడు స్వర్ణాలు సాధించిన వ్రితి.. తాజాగా మరో రెండింటిని ఖాతాలో వేసుకుంది. ఖేలోఇండియా యూత్ గేమ్స్‌లో ఐదు స్వర్ణాలు గెలిచిన ఏకైక స్విమ్మర్‌గా వ్రితి నిలిచింది. బుధవారం జరిగిన మహిళల 1500మీటర్ల ఫ్రీ స్టయిల్ ఈవెంట్‌లో వ్రితి(17:59:51సె) అగ్రస్థానంతో పసిడి దక్కించుకోగా, అదితి, శ్రీచరణి వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. 200మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లోనూ వ్రితి మరో పసిడి సొంతం చేసుకుంది. మరో వైపు మహిళల టెన్నిస్ సింగిల్స్‌లో రాష్ట్రానికి చెందిన లక్ష్మి దండు రజత పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన ఫైనల్లో లక్ష్మి 1-6, 3-6తో మాయా రాజేశ్వరి(తమిళనాడు) చేతిలో ఓడింది.

శ్రీకాంత్ ముందంజ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ముందంజ వేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 22-20, 21-19తో వాంగ్ జు వీ(చైనీస్ తైపీ)పై అద్భుత విజయం సాధించాడు. 45 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రత్యర్థి నుంచి దీటైన పోటీ ఎదురైనా..వెనుకకు తగ్గకుండా శ్రీకాంత్ పోరాడాడు. మిగతా మ్యాచ్‌ల్లో మిథున్ మంజునాథ్ 21-17, 21-8తో జాసన్ గునవాన్(కెనడా)పై, ముత్తుస్వామి సుబ్రమణ్యన్ 21-14, 21-17తో లియోంగ్ జున్ హో(మలేషియా)పై గెలిచారు. సమీర్‌వర్మ 14-21, 18-21తో అంగుస్ ఎంగ్(హాంకాంగ్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్‌లో మాల్విక బన్సోద్ 22-20, 21-8తో లుసియా కాస్టిలోపై గెలిచి ముందంజ వేసింది.

ఏసీసీ చైర్మన్‌గా జై షా

న్యూఢిల్లీ: ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) చైర్మన్‌గా ముచ్చటగా మూడోసారి జై షా ఎన్నికయ్యాడు. శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు షమ్మి సిల్వా..షా పేరును ప్రతిపాదించగా, మిగతా సభ్యులందరూ బలపర్చారు. 2021లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్ నజ్ముల్ హసన్ తర్వాత ఏసీసీ చైర్మన్ పగ్గాలు అందుకున్న జై షా వరుసగా మూడోసారి కుర్చీని కైవసం చేసుకున్నాడు. తనపై నమ్మకముంచి గెలిపించిన సభ్యులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపాడు. ఆసియా అంతటా క్రికెట్‌ను విస్తరించేందుకు ఏసీసీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా జై షా పేర్కొన్నాడు.

నిలకడగా మయాంక్ ఆరోగ్యం

అగర్తలా:కర్ణాటక రంజీ టీమ్ కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఆరోగ్యం కుదుటపడుతున్నది. త్రిపురతో రంజీ మ్యాచ్ ముగించుకుని ఢిల్లీ బయల్దేరిన మయాంక్..విమానంలో గుర్తు తెలియని ద్రవం తాగి దవాఖాన పాలయ్యాడు. అయితే వైద్యుల నిరంతర పర్యవేక్షణతో తన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు మయాంక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. త్వరలోనే తిరిగి జట్టులోకి వచ్చేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. క్లిష్ట సమయంలో అభిమానులు తనపై చూపించిన ప్రేమకు మయాంక్ ట్విటర్‌లో కృతజ్ఞతలు తెలిపాడు.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

విశాఖపట్నం: భారత క్రికెటర్లు ప్రాక్టీస్‌లో బిజీ అయ్యారు. ఇంగ్లండ్‌తో రెండో టెస్టు కోసం విశాఖపట్నంకు చేరుకున్న టీమ్‌ఇండియా క్రికెటర్లు బుధవారం స్టేడియంలో చెమటోడ్చారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి మ్యాచ్ చేజార్చుకున్న రోహిత్ సేన..వైజాగ్ టెస్టులో పుంజుకోవాలని చూస్తున్నది. ఉదయం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో భారత బ్యాటర్లు స్వీప్, రివర్స్ స్వీప్‌పైనా ప్రధానంగా దృష్టి సారిస్తూ ప్రాక్టీస్ కొనసాగించారు.

అశ్విన్ నంబర్ వన్

దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత సీనియర్ స్పిన్నర్ అశ్విన్ నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 853 పాయింట్లతో టాప్ ర్యాంక్ నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన అశ్విన్ తన ర్యాంకింగ్ పాయింట్లను మరింత మెరుగుపర్చుకున్నాడు. ఆరు వికెట్లతో రాణించిన బుమ్రా (825) నాలుగో ర్యాంక్‌కు చేరుకోగా, జడేజా (754) ఆరో ర్యాంక్‌లో ఉన్నాడు. బ్యాటింగ్‌లో విలియమ్సన్ (864) అగ్రస్థానంలో కొనసాగుతుండగా, విరాట్ కోహ్లీ (767) ఒక్కడే ఆరో ర్యాంక్‌లో ఉన్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.